‘జగనన్న సురక్ష’తో ప్రజలకు మేలు

- నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు
- ఒకేసారి 854 సర్టిఫికెట్ల పంపిణీ
- 43వ వార్డు లబ్ధిదారుల హర్షం



జగనన్న సురక్ష శిబిరానికి హాజరైన లబ్ధిదారులు



శ్రీనివాసనగర్‌లో లబ్ధిదారులకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు అందజేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: ప్రభుత్వ సేవలు ప్రజలకు నూటికి నూరు శాతం అందాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీనివాసనగర్‌లోని దాడి రామ్మూర్తి కల్యాణ మండపం వద్ద జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఇంటి వద్దే ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. గతంలో కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ రోజుల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులు, సమస్యలను బట్టి ముఖ్యమంత్రి ప్రజల అవసరాలు తీర్చేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ నెలాఖరు వరకు జగనన్న సురక్ష కొనసాగుతుందని, ప్రతి వలంటీర్ తన పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న 11 రకాల సర్టిఫికెట్లు గురించి వివరించాలని చెప్పారు. తూర్పు కాపు కులస్తులకు మైగ్రేషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. సురక్ష శిబిరాలకు తహసీల్దార్ తప్పకుండా హాజరు కావాలని, అప్పుడే రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి వీలు కలుగుతుందని సూచించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో క్లస్టర్ వారీగా వలంటీర్ ఎన్ని గృహాలను సందర్శించారు, బయోమెట్రిక్ ఎంత శాతం నమోదైంది, ప్రజల స్పందనపై సమీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారు.

ఇంటి వద్దకే సేవలు..

జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు, కొన్ని సంక్షేమ పథకాలకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు చాలా అవసరమన్నారు. అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దకే సర్టిఫికెట్లు అందజేస్తున్నారని తెలిపారు. జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ మాట్లాడుతూ 43వ వార్డులో 1,052 మందికి టోకెన్లు ఇవ్వగా.. 854 మందికి ఒకే రోజు సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. ఇందులో 469 కుల, 373 ఆదాయ పత్రాలు, రెండు రైస్ కార్డులు ఉన్నాయన్నారు. కార్పొరేటర్ ఉషశ్రీ మాట్లాడుతూ పథకాలకు అర్హత ఉన్నా సరైన ధ్రువపత్రాలు లేక అనర్హులుగా ఉంటున్నారని, అటువంటి వారంతా జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకుని సర్టిఫికెట్లు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, ఏపీడీ పద్మావతి, ఆర్వో బాబూరావు, టీపీవో శ్రీలక్ష్మి, ఏఈ రమణమ్మ, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, వార్డు నాయకులు, జక్కంపూడి సత్యనారాయణ, బైర వెంకట్, పారుపల్లి రవి, రమణబాబు, భాను మూర్తి, మహాదాస్య గోపి, పద్మశేఖర్, బి.శ్రీను, రాణి, రమ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అడగ్గానే ధ్రువపత్రాలు అందజేశారు



కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం గతంలో ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. జగనన్న సురక్ష వచ్చాక వలంటీర్, సచివాలయ సిబ్బంది మా ఇంటికొచ్చి ఏ సర్టిఫికెట్లు కావాలని అడగ్గా.. కుల, ఆదాయ ధ్రువపత్రాలు కావాలన్నాను. వివరాలు నమోదు చేసుకుని వాటిని అందజేశారు. చాలా సంతోషంగా ఉంది.

– నార్ని దేవి, శ్రీనివాసనగర్

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం



కాలేజీలో చేరేందుకు క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు అవసరం. గతంలో వీటి కోసం రోజూ తిరగాల్సి వచ్చేది. జగనన్న సురక్షతో అవన్నీ పోయాయి. సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి వివరాలు తీసుకుని సర్టిఫికెట్లు అందజేశారు. మాలాంటి విద్యార్థులకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో ప్రయోజనం.

– కందివలస సతీష్, విద్యార్థి, నందగిరినగర్

ఇల్లు కదలకుండానే సర్టిఫికెట్లు వచ్చాయి



వలంటీర్, సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. సంక్షేమ పథకాలకు అవసరమైన క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేశాను. శిబిరానికి వచ్చి తీసుకోమని వలంటీర్ ఫోన్ చేశారు. ఇల్లు కదలకుండానే సర్టిఫికెట్లు వచ్చాయి. నమ్మలేకపోయాను.

– తనకాల పూర్ణ, వెంకటేశ్వర కాలనీ

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం



మాట్లాడుతున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు తక్షణం పరిష్కారం లభిస్తుందని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు అన్నారు. వార్డులోని 280వ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్షపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. జేసీఎస్ మండల కన్వీనర్ నీలి రవి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో పథకాలు, ఇతర ప్రజా సమస్యలపై ఆయన సమీక్షించారు. జగనన్న సురక్షలో భాగంగా 11రకాల ప్రయోజనాలు పొందవచ్చని చెప్పారు. ఈ నెల 19న నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చే ప్రజలకు టోకెన్లు ఇచ్చి ప్రణాళికా బద్ధంగా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. నీలి రవి జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన వివరాలను తెలిపారు. ఈ సచివాలయ పరిధిలోని గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నివాసుల సమస్యలను తెలుసుకుని టోకెన్లు అందించాలని చెప్పారు. సచివాలయ అడ్మిన్ గిరీష్, సచివాలయ కన్వీనర్ ఐ.రవికుమార్, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు అమ్మవారికి సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించి పాల్గొనవచ్చు.

క్లుప్తంగా

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న రచయిత వేణు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో జరిగిన కవి సమ్మేళనం అందరినీ అలరించింది. ప్రధాన వక్త రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ సామాజిక బాధ్యతల్లో మనో వైజ్ఞానిక అంశాల పరిష్కారం దిశగా కవులు రచనలు చేయాలని సూచించారు. కవిత్వం ఒక మిత్రుడి వంటిదని, సర్వ కాలాల్లో ఆదరణ పొందుతుందన్నారు. ప్రముఖ కవి ముక్దుం మొహియుద్దీన్ గురించి సభకు పరిచయం చేశారు. సభాధ్యక్షుడు శేఖర మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ భాష సంస్కృతుల వికాసానికి, ఉన్నతికి కవులు, రచయితలు కృషి చేయాలన్నారు. వివిధ కవిత్వ ప్రక్రియల్లో నవ కవిత అందరినీ అలరించేలా ఉండాలని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చిన సూర్యనారాయణ, బి.రాధారాణి, కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత తదితరులు వివిధ అంశాలపై చదివిన కవితలు అలరించాయి.

సీపీఎం ధర్నా

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ యూజర్ చార్జీలు ఆపాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పైక్కన గల రామచంద్రనగర్ సచివాల యం వద్ద ధర్నా చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు టార్గెట్‌లను నిర్ణయించడం, చేయకపోతే సస్పెండ్ చేయడం దుర్మార్గమని, చట్ట విరుద్ధమని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 2020 విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలో అమలు చేయరాదని, ట్రూ అప్‌చార్జీలు, కస్టమర్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ నాయకులు గౌరీష్, లక్ష్మీపతి, జ్యోతి, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో 8, 9 తేదీల్లో ఆరోగ్య సదస్సు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ఈ నెల 8, 9 తేదీల్లో ఆరోగ్య సదస్సు నిర్వహించనున్నట్టు ఆశ్రమం నిర్వాహకుడు సౌమ్యానంద్ అవదూత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం–దీర్ఘాయుస్సు అనే అంశంపై అనుభవజ్ఞులైన వైద్యులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆరోగ్య సూచనలతో పాటు ఆహారం, బయో సైకాలజీ, ఆరోగ్యం ఔషధ మూలం, వంట గదిలో ఔషధాలు, వ్యాధి కారకాలు, తదితర వాటిపై సూచనలు, సలహాలు చేస్తారని తెలిపారు. ఈ సదస్సు ఆయా రోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 10న ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, మధుమేహం, బీపీ, పక్షవాతం, క్యాన్సర్, తదితర బాధితులకు ప్రత్యేకంగా సలహాలు, సూచనలు ఇవ్వడానికి వైద్య సదస్సు నిర్వహించనున్నామన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవడానికి, మరింత సమాచారం కోసం 90305 02164 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

కుంగిపోతున్న రహదారి



శ్రీప్రకాష్ స్కూల్ ఎదురుగా రోడ్డు దుస్థితి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు టీపీటీ కాలనీలోని శ్రీప్రకాష్ స్కూల్ ఎదురుగా రహదారి కుంగిపోతోంది. కొద్ది రోజులుగా రోడ్డు దెబ్బతింటూ ప్రమాదకరంగా మారుతోంది. ఆ ప్రాంతంలో రాత్రి పూట రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

- ఏఎస్సార్ నగర్ పర్యటనలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ఏఎస్సార్ నగర్‌వాసులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లో బుధవారం జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ.. డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు, జీవీఎంసీ, టిడ్కో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ ప్రాంతంలో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కంపా హనోకు మాట్లాడుతూ మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అందజేయాలని కమిషనర్‌ను కోరారు. లబ్ధిదారులు గ్రీన్ బెల్ట్, రోడ్డు పక్కనే తాత్కాలిక నివాసాల్లో నివసిస్తున్నారని వీలైనంత త్వరగా ఇళ్లను కేటాయిస్తే ఇక్కడ సమస్యలు తీరుతాయని తెలిపారు. కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఏఎస్సార్ నగర్‌లో 280 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, వాటి చుట్టూ సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పనులు 15 రోజుల్లో పూర్తయ్యేలా చూడాలని టిడ్కో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజినీర్‌ను ఆదేశించారు. లబ్ధిదారుల జాబితా ప్రకారం ఇళ్లు అందించేందుకు సిద్ధంగా ఉండాలని యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడుకు కమిషనర్ సూచించారు. స్థానిక పరిసరాల్లో గ్రీనరీ, విద్యుత్ లైట్ల ఏర్పాట్లు, భూగర్భ డ్రైనేజీలను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. పర్యటనలో జోన్-5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఏపీడీ పద్మావతి, టిడ్కో హౌసింగ్ సహాయక ఇంజనీర్, ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, సీనియర్ నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, దుర్గ, నాయుడు, సురేష్, బాబూరావు, మహేష్ ఏఎస్సార్ నగర్ కాలనీ నాయకులు పాల్గొన్నారు.

మధురానగర్ హైస్కూల్‌లో అదనపు అంతస్తు



శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్

సీతంపేట: రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ విశాఖను దానికి తగ్గట్టుగానే జీవీఎంసీ అభివృద్ధి చేస్తోందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో రూ.36 లక్షలతో నిర్మించనున్న అదనపు అంతస్తుకు బుధవారం స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ హైస్కూల్‌కు అవసరమైన ఐదు తరగతి గదులను ఈ నిధులతో నిర్మించనున్నట్టు చెప్పారు. ఉత్తర నియోజకవర్గంలోని ప్రతి వార్డులో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ భక్తులకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మించామన్నారు. కార్పొరేటర్ గోవింద్ మాట్లాడుతూ కె.కె.రాజు సూచనలతో 25వ వార్డు అభివృద్ధికి రూ.1.5 కోట్లు జనరల్ ఫండ్స్ నుంచి, రూ.2 కోట్లు స్టాండింగ్ కమిటీ నిధులు మంజూరు చేసిన మేయర్ హరివెంకటకుమారికి ధన్యవాదాలు తెలిపారు. బీటీఆర్ కాలనీ రెల్లి వీధిలో రూ.1.32 కోట్లతో మూడంతస్తుల భవనం నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, ఏపీడీ దుర్గాప్రసాద్, ఏఈ శ్రీరామమూర్తి, ప్రధానోపాధ్యాయులు శాంతికుమారి, దేముడుబాబు, వార్డు నాయకులు భోగవిల్లి గోవింద్, సమ్మెట్ల వెంకటేష్, హరికృష్ణ, సన్నీ ఉపాధ్యాయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రజలకు నాణ్యమైన సేవలు



26వ వార్డులో మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 26వ వార్డు శంకువాని పాలెం సచివాలయం పరిధి బోరావారి వీధిలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు వివరిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ లక్ష్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, 26వ వార్డు నాయకులు పాండవ శ్రీను, అమ్మాజి, నవాబ్, శ్యామల, ఎం.సునీల్, హరి, శేషు, బాబ్‌జాన్, ఫరూఖీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మురళీనగర్‌లో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని అప్సర్ ఖాన్ ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు జాకెట్ల తయారీకి కటింగ్ విధానాన్ని అప్సర్ ఖాన్ వివరించారు. దారాలు, క్లేతో ఆభరణాల తయారీ విధానంపై హిమబిందు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.పుష్పలత, మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సత్యనారాయణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మానసిక స్థితి సరిగా లేని ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా.. సీతమ్మధార టీపీటీ కాలనీ సునీత నర్సింగ్ హోమ్ ప్రాంతంలో సత్యనారాయణ(40) తన తల్లితో కలిసి నివసిస్తున్నాడు. మృతుడు పెయింటింగ్, కార్పెంటర్ పనులు చేస్తుంటాడు. అతడి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలోని ఫ్యాన్‌కు చీర కట్టి ఉరిపోసుకుని మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు ద్వారకా జోన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వార్డుల అభివృద్ధికి కృషి



51వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వస్తున్న వినతుల మేరకు వార్డులను అభివృద్ధి చేస్తున్నట్టు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. 51వ వార్డులోని 290, 291 సచివాలయం పరిధి మాధవధార వుడా క్వార్టర్స్, మహత్ కాలనీ ప్రాంతాల్లో రూ.40 లక్షలతో నిర్మించనున్న డ్రెయిన్లు, రోడ్ల పనులకు బుధవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మౌలిక వసతుల విషయంలో ఎప్పటికప్పుడు ప్రజల్లోకి వెళ్తూ వారి అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ భరణి, 51వ వార్డు నాయకులు తిరుమల రావు, రత్నం, వరలక్ష్మి, ధర్మవతి, రాణి, రాజేశ్వర రావు, శ్యామ్, గణేష్, వినోవ్, ధర్మేంద్ర, త్రినాథ్, రమణ, ఎల్లాజి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఉదయం పంచామృతాభిషేకాలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు జలాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల నామాగోత్రాలతో విశేషపూజలు జరిపించారు. పార్వతీదేవే కలియుగంలో ఎరుకుమాంబగా అవతరించినట్లు భక్తులు నమ్ముతారు. అమ్మవారికి పసుపు నీళ్లతో అభిషేకం చేయడం వల్ల కోరికలు నెరవేరుతాయని, పెళ్లి కాని వారికి పెళ్లి అవుతుందని, పిల్లలు లేని వారికి పిల్లలు పుడతారనేది భక్తుల నమ్మకం అని అర్చకులు శ్రీనివాస్ తెలిపారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కోసం వంటావార్పు



జోన్-5 కార్యాలయం వద్ద వంటావార్పు చేస్తున్న దళిత బహుజనులు

కంచరపాలెం: తాగునీరు, మౌలిక వసతుల కోసం జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయం వద్ద బుధవారం 42, 51, 55 వార్డుల పరిధిలోని ఏకలవ్య కాలనీ, ఇందిరాగాంధీ కాలనీ, గాంధీనగర్ మురికివాడలకు చెందిన దళిత బహుజన పేదలు భారీ ఎత్తున వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఇ.లక్ష్మి, ఎం.లక్ష్మి నేతృత్వంలో దళిత బహుజనులు వంటావార్పు చేసి జోనల్ కమిషనర్ కృష్ణ చాంబర్‌ను ముట్టడించారు. ఆయన లేకపోవడంతో సమస్యలు పరిష్కరించే వరకూ కదిలేది లేదంటూ నిరసనకారులు బైఠాయించారు. సుమారు 5 గంటల పాటు జోనల్ కార్యాలయాన్ని దిగ్బంధించారు. కంచరపాలెం పోలీసుల జోక్యంతో నిరసనకారులను శాంతింపజేశారు. ఆయా మురికివాడల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు సమర్పించినా.. వాటిని కూడా సచివాలయాలకు ఇచ్చి అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో నిరసనకారులు ఆనందం వ్యక్తం చేశారు. సంఘ కన్వీనర్ ఈసరి లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, రోహిణి, బాలనాగమ్మ, నిర్మల, ఏడుకొండలు, ఎం.వెంకటేశ్వర్లు, కె.మల్లయ్య, పి.లక్ష్మి, ఎస్.వి.రమణ, రూప, ఆసనాల అప్పారావు, కొరువాడ అప్పారావు, పైడిరాజు, సతీష్, నాగేశ్వరరావు, రాజేష్, వీర్రాజు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సమాచారమ్

ఐటీఐ C/o కంచరపాలెం



కంచరపాలెంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ

కంచరపాలెం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ల్లో టెన్త్ పూర్తి చేసిన ఆసక్తి గల విద్యార్థులు చేరవచ్చు. సీట్ల ట్రేడ్లు, కౌన్సెలింగ్ తదితర వివరాలు తెలుసుకునేందుకు కంచరపాలెం ఐటీఐ జంక్షన్‌లోని మూడు ఐటీఐల్లో సంప్రదించవచ్చు. కంచరపాలెం పాత ఐటీఐ, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రభుత్వ బాలికల ఐటీఐ, ప్రభుత్వ ఐటీఐ గడుపిల్లి (నరవ–కంచరపాలెం ఐటీఐలో ఉంది)కి సంబంధించిన సమాచారాన్ని కింద పేర్కొన్న ప్రిన్సిపాళ్ల ఫోన్ నంబర్లకు కాల్‌చేసి తెలుసుకోవచ్చు.

ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల వివరాలు

పారిశ్రామిక శిక్షణ కేంద్రం	ప్రిన్సిపాల్ పేరు	ఫోన్ నంబర్
ప్రభుత్వ పాత ఐటీఐ, కంచరపాలెం	జె.శ్రీకాంత్	99595 53187
ప్రభుత్వ బాలికల ఐటీఐ, ఇండస్ట్రియల్ ఎస్టేట్	ఎల్.గౌరీమణి	94405 96054
ప్రభుత్వ ఐటీఐ, గడుపిల్లి(నరవ)	సిహెచ్.సునీల్‌కుమార్	79813 08986

విష్ణు సహస్రనామ పారాయణ ప్రారంభం

డాబాగార్డెన్స్ : పాతనగరంలోని గీతాభవన్‌లో గీతా ప్రచార సమితి స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం కోటి శ్రీవిష్ణు సహస్రనామ సామూహిక పారాయణ బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఆచార్య సార్వభౌమ డాక్టర్ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ వల్ల లోక కల్యాణంతో పాటు విశ్వశాంతి కలుగుతాయన్నారు. భక్తులందరూ ముక్త కంఠంతో సామూహికంగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం. వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, ఎంపీ రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖి



విద్యార్థుల తల్లిదండ్రులకు పోషకాహారంపై సూచనలిస్తున్న వైద్యాధికారి డాక్టర్ భాషిణి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో నడుస్తున్న అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో బుధవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఈ కార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అతిథి డివిజనల్ రైల్వే హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాషిణి మాట్లాడుతూ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు పలు ఆరోగ్య సూచనలిచ్చారు. పోషక విలువలు, ఆరోగ్యవంతమైన ఆహారం, సమతుల ఆహారం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య వంతమైన ఆహార నియమాల ద్వారా పిల్లల్లో సరైన అభివృద్ధి ఎలా కలుగుతుందో ఈకార్వో ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్లు మధుస్మిత సాహూ, కవితా గుప్తా, ఇతర సభ్యులు పాల్గొన్నారు.